క్లుప్తంగా

మేమున్నామని..



ఆర్థికసహాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

సారవకోట: మండల కేంద్రానికి చెందిన శిమ్మ మల్లేషు కుమార్తె మానస అనారోగ్యంతో బాధ పడుతోంది. ఈ విషయం 1996–97లో మల్లేషుతోపాటు పదో తరగతి చదువుకున్న విద్యార్థులకు తెలిసింది. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.26 వేల ఆర్థికసహాయాన్ని సోమవారం మల్లేషు కుటుంబ సభ్యులకు అందజేశారు.

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ పి.లత తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు సోమవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అనంతరం సర్టిఫికెట్లు పరిశీలించి సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

సరుబుజ్జిలి: అర్హతే ప్రామాణికంగా, వివక్షతలేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని రాష్ట్ర యువజన విభాగం ప్రధానకార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. మండలంలోని పాలవలసలో జగనన్న మాట– నాని అన్న బాట కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. టీడీపీ నాయకుల మోసపు మాటలను నమ్మవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర బెవర మల్లేశ్వరరావు, సచివాలయం కో ఆర్డినేటర్ అత్తులూరి రవికాంత్, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, పాలవలస, రావివలస సర్పంచ్‌లు గజ్జన మోహనరావు, వండాన కృష్ణ, కొత్తకోట ఎంపీటీసీ సురవరపు సింహాచలం, అసిరినాయుడు, ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'

మెళియాపుట్టి: జూలై 1 నుంచి 28వ తేదీ వరకు జగనన్న సురక్ష ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేయాలని ఎంపీడీఓ చంద్రకుమారి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్వోలు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో అధికారులు రెండు బృందాలుగా 21 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమస్యలు గుర్తించి తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బైపోతు ఉదయ్ కుమార్, పరిపాలనాఅధికారి తిరుపతి పట్నాయక్, విస్తరణ అధికారి తారకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రహదారి కబ్జాపై ఫిర్యాదు

పాతపట్నం: మండల కేంద్రంలోని పాల కేంద్రం వద్ద రాళ్ల క్వారీ వీధిలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కనకాల నారాయణ రహదారిని కబ్జా చేశాడని ఆ విధి వాసులు సోమవారం స్పందనలో తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డుకు అడ్డంగా సిమెంట్ గోడను నిర్మాణం చేపడుతున్నాడని, దీంతో రాకపోకలకు నిలిచిపోయాయని ఆ వీధి వాసులు కె.అప్పడు, అక్కంద్ర జయమ్మ, అమర పార్వతి, చిన్నారి తదితరులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని కాపాడాలని కోరారు.

22 మందికి కంటి ఆపరేషన్లు

కొత్తూరు: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కంటి ఆపరేషన్‌ల కోసం 22 మందిని గుర్తించారు. వీరిని సోమవారం ప్రత్యేక వాహనం ద్వారా శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి స్థానిక ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య తీసుకువెళ్లారు. వీరికి ఉచితంగా ఆపరేషన్ చేయించడం జరుగుతుందని జానికిరామయ్య తెలిపారు.

పెన్షనర్లు ఈ-ఫైలింగ్ చేయించుకోవాలి

ఆమదాలవలస: ఇన్‌కంటాక్స్ పరిధిలోకి వచ్చే పెన్షనర్లు జూలై 31వ తేదీ లోగా ఈ–ఫైలింగ్ చేయించుకోవాలని ఆమదాలవలస సబ్ ట్రెజరీ అధికారి ఎస్.సువర్ణరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌టీఓ కార్యాలయానికి వచ్చి ఫారం–16 తీసుకోవాలని పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సిమ్మినాయుడు, బి.జనార్దనరావు పేర్కొన్నారు.

సొంతింటి కల సాకారం

- ప్రభుత్వ సాయం అందడంతో జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం
- పూర్తిస్థాయిలో మౌలిక సాకర్యాల కల్పన





జమ్ము పంచాయతీ పరిధిలోని గడ్డెయ్యపేట లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

నరసన్నపేట: సుమారు 18 ఏళ్ల క్రితం పుట్టిన ఊరు అల్లాడపేటలో జీవనోపాధి లేకపోవడంతో నరసన్నపేటకు కింతలి రోహిణి, మోహనరావు కుటుంబం వలస వచ్చింది. ఇన్నాళ్లు అద్దె ఇళ్లల్లో నివాసం ఉన్నారు. వచ్చిన సంపాదనలో చాలా మేరకు అద్దెకే సరిపోయేది. ఈ దశలో సొంతింటి కోసం అనేక ప్రయత్నాలు చేశారు. గత టీడీపీ కాలంలో అయితే ప్రధాన నాయకుల ఇళ్లకు వెళ్లి దరఖాస్తులు పలు సార్లు ఇచ్చారు. హామీలు, చీదరింపులే మిగిలాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడి అధికారంలోకి వచ్చిన తర్వాత వారి కల నెరవేరింది. విలువైన స్థలం ఉచితంగా ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి కొంత ఆర్థిక సహాయం చేశారు. ఇప్పుడు జమ్ము పంచా యతీ లేఅవుట్‌లో ఇంటి నిర్మాణం చేసుకున్నారు. హాయిగా సొంతింటిలో నివాసం ఉంటున్నారు.

పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం..

నరసన్నపేట మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణ వివరాలు ఇలా..	
మంజూరైన ఇళ్లు	2556
నిర్మాణం పూర్తయిన ఇళ్లు	1168
వివిధ దశల్లో ఉన్నవి	1388
ఇప్పటివరకు చెల్లించిన మొత్తం	రూ.26 కోట్లు
జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనకు కేటాయించిన మొత్తం	రూ.10 కోట్లు

ఏళ్ల తరబడి అద్దె ఇళ్లల్లో ఉంటున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. ఆర్థిక స్తోమత, ఇంటి స్థలం లేని పరిస్థుతుల్లో ఉన్న వేలాది కుటుంబాలవారు నేడు ఓ ఇంటివారు అయ్యారు. జగనన్న కాలనీ లేఅవుట్లలో మౌలిక వసతులు (విద్యుత్, రోడ్లు, మంచి నీరు) కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఒక్క నరసన్నపేట మండలంలోనే వందలాది కుటుంబాల కల సాకారమైంది. నరసన్నపేట పంచాయతీ పరిధిలో టీడీపీ ఏనాడూ ఒక



గడ్డెయ్యపేట లేఅవుట్‌లో రోడ్డు నిర్మాణం చేపడుతున్న దృశ్యం

పేదవాడికి ఇంటి స్థలం ఇచ్చిన పాపానపోలేదు. అలాంటిది వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కృషితో మండలంలో చిన్నా, పెద్దా 43 లేఅవుట్లను ప్రభుత్వం వేసింది. వీటిల్లో గడ్డెయ్యపేట, జమ్ము, ఉర్లాం, పోతయ్యవలస, కోమర్తి, మడపాం, మాకివలస, గోపాలపెంట, చోడవరం, చెన్నాపురం, లుకలాం, యారబాడు గ్రామాల్లో ప్రత్యేక లేఅవుట్లు వేసి 1415 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. జమ్ము పంచాయతీ పరిధిలో 800 ఇళ్లతో మరో గ్రామమే నిర్మాణం అవుతుంది.

చిట్ ఫండ్ కంపెనీలో పనిచేస్తూ నరసన్నపేటకు 13 ఏళ్ల క్రితం పి.వాణి, సురేష్‌కుమార్ దంపతులు వలస వచ్చారు. అద్దే ఇంట్లో ఇన్నాళ్ల కాలక్షేపం చేశారు. పక్కా ఇంటి కోసం అందరి కాళ్ల పట్టుకున్నారు. ఎవరూ కనికరించలేదు. సొంత స్థలం ఉంటే ఇల్లు ఇస్తామన్నారు. నరసన్నపేటలో ఇంటి స్థలం కావాలంటే కనీసం రూ.10 లక్షలు ఉండాలి. అంత డబ్బు లేక అద్దె ఇళ్లల్లోనే ఇన్నాళ్లు మగ్గారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ వలంటీర్ వచ్చి ఇంటి స్థలం కోసం సచివాలయంలో దరఖాస్తు చేయించారు. ఇంటి స్థలం మంజూరైంది. ఇఇటి నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయి. ఇప్పుడు సొంతింట్లో ఆనందంగా జీవిస్తున్నారు.



నియామకపత్రాల అందజేత



నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో భర్తీ చేసిన 10 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 16 మంది ఆయాలు, ఆరుగురు మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం నియామకపత్రాలను అందజేశారు. నరసన్నపేటలోని ఐసీడీఎస్ పీఓ నాగమణి ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ కల్యాణ మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. నరసన్నపేట, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, గుప్త, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, సదాశివుని కృష్ణ, ధర్మాన జగన్, కణితి సత్తిబాబు, పంగ బావాజీనాయుడు, బొబ్బాది ఈశ్వరరావు, నక్క తులసదాస్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎలక్ట్రానిక్ యంత్రాలకు సీళ్లు వేస్తున్న సిబ్బంది

జలుమూరు: వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని పలాస తూనికలు, కొలతల శాఖ పరిశీలకులు టి.శ్రీధర్ అన్నారు. సోమవారం చల్లవానిపేటలో ఎలక్ట్రానిక్ యంత్రాలకు సీళ్లు వేసి వ్యాపారులతో మాట్లాడారు. విధిగా ప్రతీ సంవత్సరం సీళ్లు వేసుకోవాలన్నారు.

పశుబీమా సద్వినియోగం చేసుకోవాలి

ఆమదాలవలస: పశు బీమా పథకాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమదాలవలస పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్.ఆనందరావు సూచించారు. పట్టణంలోని రెడ్డి క్వార్టర్స్‌లో గల పాడి రైతులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పశుబీమా పథకం గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలపై అవగాహన కల్పించారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సహకారంతో తాత్కాలిక పనులు

బూర్జ: మండలంలోని 17ఎల్ వంశధార ప్రధాన కాలువ ద్వారా నుంచి వచ్చేనీరు పిల్ల కాలువకు చేరకపోవడంతో ఏటా సాగునీటికి ఇబ్బంది పడుతున్నామని తమ్మినాయుడుపేట గ్రామ సర్పంచ్ మూడడ్ల సదీష్ట, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం.సత్యనారాయణ, రైతులు తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా స్పందిచలేదన్నారు. గ్రామంలోని ఆయకట్టు రైతుల ఆర్థిక సహకారంతో పిల్ల కాలువలో తాత్కాలిక పనులు చేపట్టడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి పిల్ల కాలువను బాగు చేయాలని కోరుతున్నారు.

బాధ్యతల స్వీకరణ

ఎల్.ఎన్.పేట: ఎంఈఓ–2గా కె.చంద్రమౌళి సోమవారం విధుల్లోకి చేరారు. చంద్రమౌళికి ఎంఐఎస్ కోఆర్డినేటర్, సీఆర్పీలు, డెంటా ఎంట్రీ ఆపరేటర్ అభినందనలు తెలిపారు.

సారవకోట: ఎంఈఓ–2గా కోడి భూలక్ష్మి నియమితులైనట్లు ఎంఈఓ ఎం.వి.రమణ తెలిపారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

మెళియాపుట్టి: ఎంఈఓ–2గా మల్లారపు పద్మనాభం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాతటెక్కలి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేశారు. పలువురు ఉపాధ్యాయులు మెళియాపెట్టి ఎమ్మార్సీ వద్ద పుష్పగుచ్ఛాన్ని అందించారు.

జలుమూరు: జలుమూరు ఎంఈఓ–2గా ఎం.వి.ఆర్.ఎస్.ప్రసాదరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రసాదరావు ఇచ్ఛాపురం మండలం డొంకూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేశారు. ప్రభుత్వం కొత్తగా మండలాలకు కేటాయించిన ఎంఈఓ–2 పోస్టుకు ఎంపికై ఇక్కడకు వచ్చారు.

పొందూరు: ఎంఈఓ–2గా దేవరవలస జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పట్నాన రాజారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆనకు ఎమ్మార్సీ కార్యాలయంలో ఎమ్మార్సీ సిబ్బంది, ఎంఈఓ–1 రామరాజులు సత్కరించారు. రాజారావు గతంలో ఎస్ఎస్ఏ జిల్లా కో ఆర్డినేటర్‌గా పనిచేశారు.

కొత్తూరు: ఎంఈఓ–2గా ఎస్.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఇంటింటికీ తాగునీటి కుళాయిలు

- స్పీకర్ తమ్మినేని సీతారాం



శ్రీనివాసాచార్యులపేటలో తాగునీటి కుళాయిలకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేట, అక్కులపేట గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.1.13 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇంటింటికీ తాగునీటి కుళాయిల కార్యక్రమానికి సోమవారం శంకుస్థాపన చేశారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ బొడ్డేపల్లి రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, ఎంపీటీసీ సభ్యుడు తమ్మినేని బాలామణి, మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గురుగుబెల్లి నీలారావు, బొడ్డేపల్లి నిరంజన్, జేఈ కె.చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి బగాది నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఆమదాలవలస రూరల్: వ్యవసాయ సేవల కోసమే గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేట రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు సోమవారం పంపిణీ చేశారు. రైతుల సంక్షేమం కోసం సొంత గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో పాటు వ్యవసాయ సేవలు సత్వరమే అందజేస్తున్నామన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

జలుమూరు: స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు వచ్చే సమస్యలు, వినతులను పూర్తిస్థాయిలో పరిశీలన చేసి వెంటనే పరిష్కారం చేయనున్నామని తహసీల్దార్ బి.సత్యం, ఎంపీడీఓ అప్పారావు అన్నారు. సోమవారం ఆయా కార్యాలయాలలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం స్పందన నిర్వహించి మండలశాఖ అధికారులతో మాట్లాడారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

సారవకోట: మండలంలో గత 9 ఏళ్లుగా ఖాళీగా ఉన్న పలు గ్రామాల అంగన్‌వాడీ పోస్టులు భర్తీ అయ్యాయి. తొగిరి, కుమ్మరిగుంట, గొర్రిబంద, గోవర్ధనపురం అంగన్‌వాడీ కేంద్రాల సహాయకులు 9 ఏళ్ల క్రితం రిటైర్ అయ్యారు. అప్పటినుంచి ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు సంబంధిత అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ సరైన రోస్టర్ రాక పోవడంతో భర్తీ కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న ఖాళీలు భర్తీ చేసేందుకు ఓపెన్ కేటగిరికి కేటాయించడంతో ఈ పోస్టులు భర్తీ అయ్యాయి. అలాగే గోపినాథపురం, బుడ్డయ్యపేట గ్రామాల మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పడిన నాటినుంచి రోస్టర్ సమస్యతో ఈ పోస్టులు భర్తీ కాలేదు. ఈ రెండు కేంద్రాల్లో సైతం ప్రస్తుతం ఈ పోస్టులు భర్తీ అయ్యాయి. వీరికి సోమవారం నరసన్నపేటలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నియామకపత్రాలు అందజేశారు.

గడపగడపకూ సంక్షేమం



గూనానపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: గ్రామాల్లో గడపగడపకూ సంక్షేమ పథకాలు అందుతుండటంతో ప్రజలంతా ఎంతో ఆనందంగా ఉన్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తండ్యాం పంచాయతీలోని గూనానపేట, దమ్ముపేట, కిల్లారిపేట, బొట్లపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కాలువలు, రోడ్లు, తాగునీరు సౌకర్యం కల్పించాలి ఆయా గ్రామస్తులు కోరారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్, గూనాన కృష్ణ, మీసాల రమణ, వెలిచేటి రామచంద్రరావు, మన్నె వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కుంటిభద్ర కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు కె.భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.ప్రసాదరావు, పీఏసీఎస్ చైర్మన్ సి.హెచ్.సూర్యనారాయణ, పార్టీ నాయకులు లోతుగెడ్డ తిరుపతిరావు, బూర్లె శ్రీనివాసరావు, కుంచాల రత్నాలు, వైకుంఠరావు, జి.ఆనందరావు, పంకజదాస్, ఆర్.రాజు, వి.సూర్యనారాయణ, వెంకటరావు, కె.త్రినాథరావు, బి.గోవిందరావు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలోనే కుంటిభద్ర రహదారి నిర్మాణానికి చర్యలు..

పాతపట్నం నియోజకవర్గంలో ఇప్పటికే అనేక గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించామని, అవసరమైన చోట రహదారులను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా ఐదు రోడ్లును బాగుచేసేందుకు అధికారులు గుర్తించినట్లు ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. పీహెచ్ (పాలకొండ–హడ్డుబంగి) రోడ్డు నుంచి పీహెచ్ రోడ్డు వయా సిరుసువాడ, కుంటిభద్ర రోడ్డు కూడా ఇందులో ఉందన్నారు. రహదారుల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోసం సీఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీనిపై సీఎం జగన్ సానుకూలంగా స్పందించారన్నారు. రోడ్డు పనుల కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ సీఎం కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయన్నారు. కుంటిభద్ర రోడ్డుకు సంబంధించిన ఫైల్ జిల్లా కలెక్టర్ వద్ద ఉందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. కుంటిభద్ర రోడ్డు విషయంపై గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

వరి విత్తనాల పంపిణీ..

కుంటిభద్ర రైతు భరోసా కేంద్రం వద్ద రాయితీపై వరి విత్తనాలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి పంపిణీ చేశారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని కోరారు. రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

నేడు జగన్నాథుని రథయాత్ర

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో జగన్నాథస్వామి రథయాత్రను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు వినోద్ కుమార్ పత్రి తెలిపారు. సోమవారం జగన్నాథ స్వామి నేత్రోత్సవం పూర్తి చేశారు. స్వామిని తెరచాటున ఉంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, సాయంత్రం రథయాత్ర ఉంటుందన్నారు.

ప్రతిభకు పురస్కారం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులను సోమవారం ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. జగనన్న ఆణిముత్యాలు కింద ప్రభుత్వం వీరిని నగదు ప్రోత్సాహకం అందజేసింది. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



సారవకోట: సారకవకోట జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



ఎల్.ఎన్.పేట: రావిచెంద్రి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు



నరసన్నపేట: బొరిగివలస జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉపాధ్యాయులు



సరుబుజ్జిలి: సరుబుజ్జిలి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో ఉపసర్పంచ్ నర్సింహప్పారావు, ఉపాధ్యాయులు